


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## – వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

## రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## *చివరి విడత: మలి సందడి (7)*

## *( వెన్నెల మాసంలో పూలూ, ముళ్లూ బెర్లిన్‌లో నేను, నా కుటుంబం)*

**కొత్తగా పెళ్లయిన దంపతులకి** తొలిరోజులు వెన్నెల మాసం. గులాబులకై పడే ఆరాటంలో వారికి ముళ్లు గుచ్చుకోవచ్చు. అదీ మధురం కావడమే వెన్నెల మాసం ప్రత్యేకత.

ఎన్నో నెలల తర్వాత కలుసుకోవడంవల్ల బెర్లిన్లో మాకిప్పుడు వెన్నెల మాసం మొదలైంది.

మర్నాడు ఆఫీసుకి వెళ్లడం – నాకు భువనేశ్వర్లో ఉద్యోగంలో చేరిన తొలిరోజుల తీపి జ్ఞాపకాల్ని స్ఫురణకు తెచ్చింది.

పెందరాళే లేచాను. స్నానాదులు ముగించాను. బ్రెడ్ తిని, పాలు తాగి 8 కాకుండా ఇంట్లో బయల్దేరాను.

ఒంటిగంటకి ఇంటికొస్తాను. వచ్చేసరికి భోజనం సిద్ధంగా ఉంటుంది. నేను, శ్రీమతి, పిల్లలు కలిసి భోంచేస్తాం. రెండు లోగా మళ్లీ ఆఫీసుకెళ్లి 5కి తిరిగొస్తాను. అంతా కలిసి బయటకి వెడతాం సరదాగా తిరగడానికి.

చాలా ఉత్సాహంగా ఆఫీసుకి వెళ్లాను.

అక్కడ నా మిత్రులకి ఈ నెలలో శ్రీమతి వస్తుందని తెలుసు కానీ, అప్పుడే వచ్చేసిందని తెలియదు.

ముందు హైనర్ డెకర్ట్ కనపడ్డాడు. అతడికి విషయం చెప్పాను.

అతగాడు తెల్లబోయాడు. తర్వాత ఆశ్చర్యపోయాడు. “నిజంగా?” అన్నాడు.

“ఔను. నిజంగానే వాళ్లు వచ్చేశారు” అన్నాను.

హైనర్ వెంటనే గబగబా ఆ విషయాన్ని మ్యుల్లర్, కిర్ష్నర్, అహమ్మద్ వగైరాలకు చెప్పేశాడు.

మా వాళ్లందరిలో ఆ వార్త పెద్ద సంచలనాన్ని కలిగించింది.

“నీకు గుట్టు చాలా ఎక్కువ!” అన్నాడు అహమ్మద్ కొంచెం నిష్ఠూరంగా.

“ఔను. నాక్కూడా తెలియనంత గుట్టు” అన్నాను.

“అంటే!” అన్నాడు అహమ్మద్ అర్థం కాక. జరిగిందంతా కథలా చెప్పాను.

“కథలా ఉంది” అన్నాడు కిర్ష్నర్ అంతా విని.

హైనర్ మాత్రం నిట్టూర్చి, “నువ్వు మీ వాళ్లని ఆమ్‌స్టర్‌డామ్‌కి రప్పించి ఉంటే బాగుండేది. మనం కలిసెళ్లి వాళ్లని పిక్ చేసుకుని వచ్చేవాళ్లం. ఇంత కథ ఉండేది కాదు” అన్నాడు.

ఆ మాట నాకూ చాలాసార్లు అనిపించింది. కానీ ఎదుటివారు మంచి ఆఫరిస్తే కొంత మొహమాటం, కొంత అపనమ్మకం. అదీ నా మెంటాలిటీ!

“అందుకే నీకు థాంక్స్ చెప్పాల్సినవాణ్ణి – సారీ చెబుతున్నాను” అన్నాను.

“ఇది సారీలకి సమయం కాదు. లెటజ్ సెలబ్రేట్!” అన్నాడు హైనర్.

సెలబ్రేషన్ అంటే నాకు భయం. అది ఖర్చుతో కూడిన పని కదా!

కానీ హైనర్ ఉద్దేశ్యం పది నిముషాల తర్వాత తెలిసింది – అతడికి ఓ కేక్ డెలివరీ ఐనప్పుడు.

మావాళ్లు వచ్చేరని తెలియగానే – అతడు ఫోన్ చేసి కేక్ ఆర్డర్ చేశాడు.

నా గురించి నేను గొప్ప చెప్పుకోవడం కాదు కానీ – చిన్నప్పట్నించీ నాకో అలవాటుంది. నేను మనస్ఫూర్తిగా ఇష్టపడేవారికి శుభం జరిగినప్పుడు – నేను వాళ్లని పార్టీ అడిగేవాణ్ణి కాదు. అడగకపోయినా నేనే వాళ్లకి కానుక ఇవ్వడమో, పార్టీ ఇవ్వడమో చేసి అలా నా సంతోషాన్ని వ్యక్తపరిచేవాణ్ణి. తమ సంతోషం కొద్దీ వాళ్లు నాకు పార్టీ ఇస్తే అది వేరే సంగతి. నేను మాత్రం నాకే శుభం జరిగినా పార్టీ ఇచ్చేవాణ్ణి కాదు. ఎవర్నీ అడిగేవాణ్ణి కాదు. అది నా పద్ధతి. ఇది తెలిసీ చాలామంది నన్ను పార్టీ ఇవ్వనందుకు పిసినారి అని నిరసించిన సందర్భాలున్నాయి. చిత్రమేమిటంటే అలా నిరసించినవారిలో నానుంచి పార్టీ తీసుకున్నవాళ్లూ ఉండేవారు.

హైనర్ నా పద్ధతిలో నన్ను మనస్ఫూర్తిగా అభిమానించే స్నేహితుడని నాకు అర్థమైంది. అంత తక్కువ వ్యవధిలో నాకతడు తన మనసులో అంత గొప్ప స్థానాన్నివ్వడం సంతోషమనిపించింది.

ఇంతకీ నాకు కేక్ సహించదు. నోటబెట్టడమే కష్టం. కానీ ఆ సమయంలో ఆ మాట చెప్పడం అసహ్యంగా ఉంటుంది. అందుకని ముందు అందరితోనూ సమంగా నేనూ కేక్ ఎంజాయ్ చేశాను.

ఐతే అప్పుడు ఎంజాయ్ చేశాను కదా అని ముందు ముందు నామీద కేకుల వర్షం కురిసే ప్రమాదముందని – ల్యూనబర్గులో ఫ్రౌ యాకేల్ ఉదంతం గుర్తు చేసింది. అందుకని ముందు జాగ్రత్తకని, “నిజానికి మామూలుగా నేను కేక్ ఎంజాయ్ చెయ్యలేను. కానీ ఈ కేక్‌లో హైనర్ స్నేహమాధుర్యం కలిసింది. ఈ రుచిని వర్ణించడానికి మాటలు లేవు” అన్నాను.

సందు దొరికిందని, “రేపు నేను నా స్నేహమాధుర్యాన్ని బీఫ్‌తో కలిపి తెస్తాను” అన్నాడు కిర్ష్నర్ వెంటనే.

అంతా నవ్వారు. హైనర్ మాత్రం గంభీరంగా ముఖం పెట్టి, “రావు కోసం ఎగ్‌లెస్ కేక్ ఆర్డరిచ్చాను. నువ్వు మీట్‌లెస్ బీఫ్ తేగలవా?” అన్నాడు.

అంతా నవ్వారు కానీ హైనర్ నవ్వలేదు. ఎదుటివారి అలవాట్లని కించపర్చడం అతడికి నచ్చదు. మాట మార్చడానికి, “నా భార్య ఇండియానుంచి రసగుల్లాలు తెచ్చింది. రేపు మీకు రుచి చూపిస్తాను” అన్నాను.

“రసగుల్లా పేరు విన్నట్లే ఉంది. దేంతో చేస్తారు?” అన్నాడు మ్యుల్లర్.

“అది ఇండియాలో ఒరిస్సా, బెంగాల్ రాష్ట్రాల్లో జనం పడిచచ్చే స్వీట్. మీకు తెలుసో తెలియదో – ఆరెండు రాష్ట్రాల్లో ప్రజలకీ శాకాహారులుంటారని తెలియదు” అన్నాను.

కిర్ష్నర్ కళ్లు మెరిశాయి, “ఆ స్వీట్ దేంతో చేస్తారు?” అనడిగాడు ఉత్సాహంగా.

“పాల విరుగుతో!” అన్నాను. అంతే – అక్కడున్న అందరి ముఖాలూ అదోలాగైపోయాయి.

“పాల విరుగుతో స్వీట్సా? అదేం టేస్టు బాబూ!” అన్నాడు అహమ్మద్ ముఖాన్ని పరమ వికారంగా పెట్టి.

ఆ ముఖం, మిగతావారి హావభావాలు చూసేక – అనవసరంగా పాలవిరుగుని ప్రస్తావించేనా అనిపించింది.

“అదేం టేస్టో – రేపు రుచి చూసి మీరే చెప్పాలి” అనేసి ఊరుకున్నాను.

అంతలో ప్రొఫెసర్ రాలెక్ అలా వచ్చి మా అందర్నీ అక్కడ గుంపుగా చూసి విషయమేమిటని అడిగి తెలుసుకుని, “కంగ్రాట్యులేషన్స్!” అన్నాడు.

నేను థాంక్సు చెప్పాను కానీ మనసుకి ఏదోలా అనిపించింది.

రాలెక్‌ది చెకోస్లేవోకియా. ఇక్కడికొచ్చి స్థిరపడిపోయాడు. ఆయన భార్య అక్కడే ఉంటోంది.

వాళ్లు విడాకులు తీసుకోలేదు. కానీ ఆమె ఇక్కడికి రాదు. ఆయన అక్కడికి వెళ్లడు. ఇండియాతో పోలిస్తే జర్మనీకి చెకోస్లేవోకియా చాలా దగ్గర్లో ఉన్నట్లు లెక్క. కానీ వాళ్లు కలుసుకోవడం లేదు.

నేను నావాళ్లని ఇక్కడికి రప్పించడానికి ఇంత శ్రమ పడ్డమూ, వాళ్లొస్తే నాకాయన కంగ్రాట్స్ చెప్పడమూ – ఏదోలా అనిపించింది మరి.

కిర్షనర్ వెంటనే, "రావు మనకోసం ఇండియానుంచి రసగుల్లాలు అనే పాల విరుగు స్వీట్సు తెప్పించేట్ట. రేపు మనమంతా రుచి చూడాలి" అన్నాడు.

అతడి గొంతులో సన్నగా హేళన ధ్వని ఉంది. రాలేక్ అది పసికట్టి సన్నగా నవ్వాడు.

కిర్షనర్ గొంతు ఆ నవ్వులో ప్రతిఫలించినట్లు తోచింది నాకు.

'వీళ్లందరికీ ఇండియన్ వెజిటేరియన్ ఫుడ్ అంటే మహా వేళాకోళంగా ఉంటుంది. రేపు రసగుల్లాలతో రసవత్తరమైన సీనుండొచ్చు' – అనుకున్నాను.

మధ్యాహ్నం భోజనానికి ఇంటికెళ్లినప్పుడు శ్రీమతి నాకు భోజనంలో రెండు రసగుల్లాలు కూడా వడ్డించింది.

అబద్ధమెందుకూ వాటిని చూస్తూనే నేను ఆఫీసులో మావాళ్లకిలాగే అదోలా మొహం పెట్టాను.

"అదేంటీ మొహమలా పెట్టారు! మన స్వీట్లు తినరు కానీ, రసగుల్లాలిష్టమేగా!" అంది శ్రీమతి ఆశ్చర్యంగా.

"ఇష్టమే కానీ, ప్రస్తుతానికి నా మోజంతా హాట్ పికిల్సుమీదే ఉంది. ఐతే మొహమలా పెట్టడానికి కారణం వేరు" అంటూ ఆమెకి ఆఫీసులో జరిగింది చెప్పి, "ఇప్పుడు నువ్వు చూసింది వాళ్ల ముఖభావాలు" అన్నాను.

"వీళ్లు మరీనండీ – తినకుండానే ఫీలింగ్సా?" అంది శ్రీమతి.

"అందుకే నాకు వాళ్లకి రసగుల్లాలు రుచి చూపించాలని లేదు! ఇండియన్స్ ఎవరికైనా ఇస్తే మహదానందపడి కళ్లకద్దుకుని తీసుకుంటారు. వీళ్లకివ్వడమెందుకూ – నవ్వులపాలు కావడమెందుకూ?" అన్నాను శ్రీమతితో.

శ్రీమతి నవ్వింది, "వాళ్లకి నచ్చిందనుకోండి. మంచి స్వీట్ తెచ్చారని మెచ్చుకుంటారు. నచ్చలేదనుకోండి – భువనేశ్వర్లో మన కాలనీలో బెంగాలీబాబులున్నారు కదా – వాళ్లకి చెప్పొచ్చు. బాబూ – మీరు గొప్పగా చెప్పుకునే రసగుల్లాని జర్మన్లు హేళన చేశారని" అంది.

"నిజమే సుమా!" అన్నాను.

ఆమె నవ్వి, "ఆ మాటకొస్తే ఎవరికో ఇవ్వడమెందుకు? మనమే ఎంజాయ్ చెయ్యొచ్చు. వాళ్లకోసమని తెచ్చాం. వాళ్లకే ఇద్దాం. ఎంజాయ్ చెయ్యకపోతే వాళ్ల కర్మ" అంది.

"కర్మనకు. బీఫ్ ఎంజాయ్ చెయ్యలేకపోవడం మన కర్మని వాళ్లంటారు, ఎవరి రుచి వారిది!" అన్నాను.

శ్రీమతి అప్పటికే ఆఫీసు వాళ్లకోసం ఓ జామ్ సీసాలో 10 రసగుల్లాలు వేసి ఉంచింది. ఓ చీటీమీద 'ఇండిష్ స్యూస్' (ఇండియన్ స్వీట్) అని వ్రాసి అంటించాను.

శ్రీమతి రెండు రసగుల్లాలు ఒలోముచ్‌కీ కోసం వేరే తీసి చిన్న ప్లాస్టిక్ డబ్బాలో వేసి మూత పెట్టింది. ఓ చీటీమీద 'ఇండిష్ స్యూస్ ఫ్యూర్ ఫ్రౌ ఒలోముచ్‌కీ' అని వ్రాసి దాన్ని వంటగదిలో ఫ్రిజ్‌మీద పెట్టి – స్వీట్సుంచిన ప్లాస్టిక్ డబ్బాని ఆ కాగితంమీద పెట్టాం.

"ఇవి తిని మనని ఇల్లు ఖాళీ చెయ్యమనదు కదా!" అన్నాను నేను.

"ఇంకా కావాలని అడిగితే ఎక్కణ్ణించి తేవాలో ఆలోచించండి. ఏకంగా పది రసగుల్లాలు మీ ఆఫీసులో వాళ్లకి ఉంచేశాం" అంది శ్రీమతి.

తననుంచి నేనిది నేర్చుకోవాలి. మనం చేస్తున్నది మంచిపని అనుకున్నప్పుడు – మనసులో శంకలు పెట్టుకోకూడదు. ఉల్లాసంగా, ఉత్సాహంగా చేయాలి. మనని మనం కించపర్చుకునే ఆలోచనలు రానివ్వకూడదు.

పాపం, ఒలోముచ్‌కీ స్వీటు గురించి ఒక్క పొల్లు ముక్కనలేదు. మర్నాడుదయం ఆ డబ్బా తీసుకుంది. ఆ రాత్రి తనూ ఫ్రిజ్‌మీద ఓ చీటీ పెట్టింది – ఫీలెన్ డాంక్ (మెనీ థాంక్స్) అని.

ఎటొచ్చీ ఆఫీసులోనే –

మర్నాడదయం ఆఫీసుకి వెళ్లేక రసగుల్లాల సీసా నా వర్క్ టేబుల్ మీద పెట్టి చాలా సీరియస్‌గా ప్రయోగాల్లోకి దిగిపోయాను. ఎంతలా అంటే హైనర్ వచ్చి సీసా చూసి నన్ను పలకరించబోయి డిస్టర్బ్ చేస్తున్నానని భయపడి వెళ్లిపోయాడు. తర్వాత ఒకరొక్కరుగా వచ్చి ఆ సీసా చూసి వెళ్లారు.

నేను కాసేపు ప్రయోగాల్లో లీనమైపోవడానికి కారణముంది. సీసాని చూస్తూనే వాళ్లు జోక్సు మొదలెడితే కొంచెం ఇబ్బందిగా ఉంటుంది. నాకు నేనుగా కాక వాళ్ల చేతనే ఆ సీసా ప్రసక్తి తెప్పిస్తే అప్పుడు కథ వేరేలా ఉంటుందని నా ఉద్దేశ్యం.

నా కొలీగ్సు దృష్టంతా ఆ సీసామీదనే ఉందని నాకు తెలుసు. నన్ను పలకరించి దాని గురించి అడగాలని తహతహలాడుతున్నారనీ తెలుసు. వర్క్ చేసుకుంటున్నవాణ్ణి డిస్టర్బ్ చెయ్యకూడదన్న మంచి సంప్రదాయం వాళ్లకి ఉండడంవల్ల, పిల్లి మెడలో గంట ఎవరు కట్టాలా అని ఆలోచిస్తున్నారనీ తెలుసు. నేను కావాలనే వాళ్లందర్నీ ఉపేక్షించి పనిలో పడిపోయినట్లు నటిస్తున్నానన్న అనుమానం వచ్చే పాటి లౌకికజ్ఞానమూ వారికి ఉండకపోదని నాకు తెలుసు.

ఐనా బయటపడకుండా పని చేసుకుని పోతున్నాను.

చివరికి హైనర్ చొరవ చేసి, "రావ్ – ఈ సీసా ఏమిటి?" అనడిగాడు.

ఉలికిపాటు నటించాను. వెంటనే మ్యుల్లర్ నవ్వి, "ఈ టైములో ఇంత బిజీగా నిన్నెప్పుడూ చూడలేదు" అన్నాను.

నేను తేరుకున్నట్లు నటించి, చిన్నగా నవ్వి, "నీకేదో నాతో అవసరపడి అలా అనిపిస్తోంది. లేకపోతే మనమంతా కూడా, ఆఫీసుకొస్తూనే బిజీ ఐపోవడం మామూలే కదా!" అన్నాను.

"అది సరేలే! ఈ సీసా ఏమిటి?" అన్నాడు హైనర్ తన ప్రశ్నని రెట్టిస్తూ.

"ఏ సీసా?" అని ఓ క్షణం ఆలోచనలో పడ్డట్లు నటించి, "ఇదా? దీనిమీద పేరుంది కదా, నా దస్తూరీ అర్థం కావడం లేదా?" అన్నాను.

"మా రావ్ దస్తూరీ ముత్యాలకోవ" అన్నాడు అహమ్మద్ వెంటనే.

"నా డిజర్టేషన్ టైపు చేయించను. రావ్ చేతే వ్రాయిస్తాను" అన్నాడు కిర్షనర్ వెంటనే.

"అందుకు టైపుకంటే చాలా ఎక్కువౌతుంది. నా భార్యాబిడ్డల్ని రప్పించడానికైన ఖర్చంతా నీనుంచి రాబడతాను" అన్నాను నేను వెంటనే.

కిర్షనర్ వెంటనే – "నువ్వేమో డాక్టరేట్ పూర్తి చేసి జీవితంలో స్థిరపడ్డావ్. డాడ్ స్కాలర్‌షిప్ వస్తుంది. నేనింకా ఎమ్మెస్ స్టూడెంటుని. నన్నంత అడక్కూడదు" అన్నాడు.

ఇక ఆ సంభాషణని ఆపాలనుకున్నాను. ఎందుకంటే కిర్షనర్‌కి తెల్లవాడినన్న జాత్యహంకారం కొంతుంది. జర్మన్ భాషాభిమానం చాలా ఉంది. అవి చాలామందికే ఉండొచ్చు కానీ – అతగాడు దాచుకోవడానికి అంతగా ప్రయత్నించడు.

ఇప్పటికే ఆర్థికంగా నన్ను తనకంటే కాస్త పైమెట్టుకి తోసేశాడు. ఆ విషయం అతడికి స్ఫురించినట్లు లేదు. స్ఫురించిందంటే తట్టుకోలేదు. సవరించుకుందుకు ఇంకేమేమో అంటాడు. అనవసరంగా గొడవ పడాలి.

అందుకని హైనర్ వంక తిరిగి, “సీసాలో ఉన్నవి రసగుల్లాలు. ప్రముఖ ఇండియన్ స్వీట్. మీకోసం తెచ్చాను” అన్నాను.

“మాకోసం స్వీట్ తెచ్చి, ఇంతవరకూ చెప్పలేదు. ఏం ఇవ్వడానికి మనసొప్పడం లేదా?” అన్నాడు అహమ్మద్.

“అదేం కాదు. నిన్న నేను రసగుల్లాలు పాల విరుగుతో చేస్తారనగానే మీ ముఖభావాలు చూశానుగా! తేవడమైతే తెచ్చాను కానీ, ఆఫర్ చెయ్యడానికి తటపటాయిస్తున్నాను” అన్నాను.

ఎగతాళినుంచి తప్పించుకుందుకు – ఇలా ముందరి కాళ్లకి బంధం వెయ్యడం – ఓ టెక్నిక్!

“ఎంతో అభిమానంగా తెచ్చావ్. నువ్విలా అనడం బాగో లేదు” అంటూ హైనర్ చటుక్కున సీసా అందుకుని మూత తీశాడు.

మూత తియ్యకుండానే సీసాలోంచీ రసగుల్లాలు తెల్లటి చిన్న బంతుల్లా కనబడుతున్నాయి.

అహమ్మద్ వెంటనే, “చూస్తుంటేనే నాకు నోరూరిపోతోంది” అన్నాడు.

“తినకుండానే రుచి తెలిసిపోయిందా?” అన్నాడు కిర్ష్నర్.

“అదేం కాదు. రావు మనదగ్గర కోస్తున్నాడు కానీ, కనీసం గుడ్డైనా తింటాడని నా అనుమానం. ఇందులో కనబడుతున్నవి గుడ్లే. ఆ రసంలా కనబడుతున్నది సొన. అందుకే నాకు నోరూరిపోతోంది” అన్నాడు అహమ్మద్.

“అవి గుడ్లే ఐతే – ఏ పక్షివో కానీ మరీ చిన్నగా ఉన్నాయి” అన్నాడు మ్యుల్లర్.

“ఏ పక్షివేమిటి – అవి కోడిగుడ్లు. ఇండియాలో మనుషులకే సరిగ్గా తిండి దొరకదు. ఇక పక్షులకేం పెడతారు? అక్కడ కోళ్లు ఇలా చిన్న చిన్న గుడ్లు పెడతాయన్న మాట!” అన్నాడు కిర్ష్నర్.

“ఇది డార్విన్‌కంటే గొప్ప థియరీ ఆఫ్ ఎవల్యూషన్. అందుకే నేనిక్కడ కోడి గుడ్లు గుమ్మడికాయంత ఉంటాయనుకున్నాను. అలా లేవంటే – బహుశా ఇక్కడ మనుషులు తాము తిన్నట్లుగా పక్షులకి పెట్టరేమో!” అన్నాను నవ్వుతూనే.

అది కిర్ష్నర్‌కి ఎక్కడ తగలాలో అక్కడ తగిలినట్లుంది. వెంటనే నా భుజం తట్టి, “ఎంతో అభిమానంగా ఇండియానుంచి స్వీట్సు తెచ్చావు. తినడానికి భయపడి మిగతావాళ్లు సంభాషణ దారి మళ్లించారు. నేనైతే మా రావ్ ఏం తెచ్చినా ఆప్యాయంగా తింటాను” అంటూ హైనర్‌నుంచి సీసా అందుకున్నాడు.

అంతలో ప్రొఫెసర్ రాలెక్ అలా వచ్చి, “ఏంటీ ఇక్కడేదో సమావేశం జరుగుతున్నట్లుంది” అన్నాడు.

“రావ్ మనకోసం ఇండియానుంచి స్పెషల్ స్వీట్ తెచ్చాడు” అన్నాడు కిర్ష్నర్ తన చేతిలో సీసా చూపిస్తూ.

రాలెక్ రసగుల్లాల్ని చూసి, “ఇవి గుడ్లలా ఉన్నాయే – ఇండియాలో నాన్ వెజిటేరియన్ స్వీట్సు ఉంటాయా?” అన్నాడు ముసిముసిగా నవ్వుతూ.

ఎందుకో మరి సాధారణంగా గంభీరంగా ఉండే రాలెక్‌కి కూడా రసగుల్లాల్ని చూడగానే జోక్ చెయ్యాలనిపిస్తోంది.

అహమ్మద్ వెంటనే రసగుల్లాలకి ‘రావూస్ ఐయర్’ అని పేరు పెట్టాడు. గుడ్లుకి జర్మన్ పదం ఐయర్.

అబద్ధమెందుకూ – ఆ తర్వాతనుంచి ఎక్కడ రసగుల్లాలు చూసినా నాకు ‘రావూస్ ఐయర్’ అనే స్ఫురిస్తుంది.

ఇంత హడావుడి చేసి మొత్తంమీద అక్కడ అంతా రసగుల్లాలు తిన్నారు.

తింటుండగా వాళ్ల ముఖకవళికలు, స్పందన చూసినప్పుడు నాకో విషయం అర్థమైంది.

నేను తినే వంటకాల్ని చిన్నబుచ్చాలన్న కోరిక అక్కడి వాళ్లందరిలో బలంగా ఉంది. అందుకు కారణం ఊహించగలను.

మనిషిని సంఘజీవి అంటారు కానీ దానర్థం ప్రతి మనిషీ తన చుట్టూ ఉన్న మనుషుల్ని ప్రేమిస్తాడని కాదు.

ప్రతి మనిషికీ సాటి మనిషికంటే తను గొప్పగా ఉండాలని ఉంటుంది. ఇతరులు తన గొప్పతనం గ్రహించడం కోసమే మనిషి సంఘ జీవితాన్ని కోరుకుంటాడు.

ఆ కోరికనుంచే కులాలు, మతాలు, జాతులు, వర్గాలు వగైరాలు పుట్టుకొచ్చాయి.

ఓ కులంకంటే మరో కులం గొప్పది. ఓ మతంకంటే మరో మతం గొప్పది. ఓ జాతికంటే మరో జాతి గొప్పది. ఓ వర్గంకంటే మరో వర్గం గొప్పది.

ఇది ఎంతవరకూ వెళ్లిందంటే – అంటరాని కులాల పేరిట అణచివేతకి గురౌతున్న వారిలో కూడా కులాల పేరిట అంటరానితనం కొనసాగింది.

హిట్లర్ జాత్యహంకారమే కదా – రెండవ ప్రపంచయుద్ధానికి దారి తీసింది! ఐతే అందుకు హిట్లర్‌ని పూర్తిగా తప్పు పట్టలేము. ఆయన దాచుకోలేదు, అంతే!

ఆ యుద్ధం జరిగిన మరో యాభై ఏళ్లదాకా – దక్షిణాఫ్రికాలో జాత్యహంకారం వికృతరూపంతో విశృంఖల విహారం చేసిందంటే – అందుకు కారణం అక్కడ ఆధిపత్యంలో ఉన్నవారికి అదే జాతికి ప్రాతినిధ్యం వహించే సంపన్న దేశాల మద్దతు పరోక్షంగానైనా లభించడమే కదా!

జాతుల్లో తెల్లవారికి – ఇతర వర్ణాలవారంటే తాము చాలా గొప్పవారమన్న భావముంది. చదువు, సంస్కారం, పరిణతి ఆ భావాన్ని చాలావరకూ అదుపు చేసినా – ఈ ఇరవయ్యొకటో శతాబ్దంలో కూడా జాత్యహంకార లీలలు సుస్పష్టమే కదా!

ప్రస్తుతానికి వస్తే నేను ఫక్తు శాకాహారిని. మాంసాహారం ముట్టను కాక ముట్టను. అది నేను పెరిగిన వాతావరణ ప్రభావమే తప్ప మాంసాహారంపై నాకేమాత్రం నిరసనభావం లేదు. కానీ నేను మాంసాహారుల్ని చిన్నబుచ్చుతున్నట్లు కొందరనుకోవచ్చు. లేదా పేద భారత దేశంనుంచి వచ్చిన ఒక సామాన్య భారతీయుడు – అప్పట్లో ఆర్థికంగా అత్యున్నత స్థాయికి చేరుకున్న జర్మనీ దేశస్థుల అభిమాన వంటకాల్ని ఆవురావురుమంటూ ఆరగించక – చౌకబారు శాకాహారంకోసం పడి చస్తాడేమన్న అహంకారమూ అంతరాంతరాల్లో ఉండొచ్చు. ల్యూనబర్గులో ఫ్రౌ యాకేల్ బంధువు నాకు పెరటి తోటలో గడ్డిని చూపి – 'ఎస్సెన్ జీ దాస్' (అది మీరు తింటారా?) అనడిగాడంటే – అది ఆ కాంప్లెక్సే కదా! అందుకు ఫ్రౌ యాకేల్ అతణ్ణి మందలించిందంటే – అతడి ప్రవర్తన నొచ్చుకోతగ్గదని గ్రహించే సంస్కారం ఆమెకున్నదనేగా!

ఇతరుల అభిరుచులపట్ల ఈ రకమైన కాంప్లెక్సు ఇక్కడివారికే కాదు, ఎక్కడెక్కడివారికీ ఉన్నదనడానికి ఎన్నో నిదర్శనాలున్నాయి. అందుకు మన దేశం కూడా మినహాయింపు కాదు.

1964లో ఆంధ్రా యూనివర్సిటీలో ఇంటర్–యూనివర్సిటీ ఆటల పోటీలు జరిగినప్పుడు – తమిళ ఆటగాళ్ని 'సాంబార్' అని ఏడిపించడం తెలుసు. చెన్నైలో ఆటల పోటీలు జరిగినప్పుడు – మనవాళ్లని 'గోంగూర' అని మోసేశారనీ – అందుకిది ప్రతీకారమనీ సమర్థించుకోవడం తెలుసు. ఇంకా సర్దార్జీల్ని 'బారా బజే' అని గోల చెయ్యడమూ తెలుసు.

మనిషి సంఘ జీవనంలో ఇదొక వర్ణపటం. ఈ కాంప్లెక్సుకి పటంలో చాలా చోట్లనే స్థానముంది.

అబద్ధమెందుకూ – ఈ తరహా అవగాహన నాకెప్పటినుంచో ఉండడంవల్ల – వాళ్ల ఈ స్పందనకి నేనే మాత్రం నొచ్చుకోలేదు. మనసులో మాత్రం, "నేను కనుక నాకు తెలియకుండానే నా అలవాట్లతో వీళ్లని నొప్పించి ఉంటే – వీళ్ల అపోహల్ని తొలగించడం నా బాధ్యత" అనుకున్నాను.

ఏదేమైతేనేం మొత్తంమీద వాళ్లంతా కలిసి పది రసగుల్లాల్నీ తినేశారు. అంతా కూడా "చూసినప్పుడు ఏదో అనిపించింది కానీ, తింటే ఊహకందని గొప్ప రుచిలో ఉన్నాయి. అద్భుతం" అని బృందగానం చేశారు.

వారి పొగడ్తలు నాకు సంతోషాన్నివ్వలేదు. చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలంటారు. యూరప్‌లో మెచ్చుకుందుకు – 'అద్భుతం' కంటే చిన్న పదం ఉండదు.

"మా వంటకం గొప్పతనం నిరూపించడమో, ప్రదర్శించడమో నా ధ్యేయం కాదు. మావాళ్లు ఇక్కడికొచ్చిన సందర్భంలో ఆ సంతోషాన్ని పంచుకునేందుకు అభిమానంతో తెచ్చిన స్వీట్ ఇది" అన్నాను.

పాపం, నామీద వాళ్లకు సదభిప్రాయమే ఉంది. కానీ అక్కడున్నవాళ్లకి ఇంతవరకూ తటస్థపడ్డ భారతీయుల్లో ఇలాంటి అలవాట్లున్నవాణ్ణి నేను మాత్రమే. అదీ వారి కాంప్లెక్సుకి కారణం.

విచిత్రమేమిటంటే చాలామంది నేను కరడు కట్టిన హిందూత్వవాదిననీ, నా అలవాట్లకి కారణం మతం వల్ల కలిగిన మూఢనమ్మకాలనీ భ్రమ పడేవారు. ఇండియాలో మా ఇంట్లో నన్ను నాస్తికుడని భ్రమ పడతారని వాళ్లకి తెలియదు.

ఇది రాకెట్లు నడిచే యుగం. ఈ యుగానిదీ అదే వేగం. ప్రతి మనిషీ ఎదుటి మనిషిని కూడా అదే వేగంతో అంచనా వెయ్యాలనుకుంటాడు. మనిషి మనిషిని అర్థం చేసుకుందుకు కొద్ది క్షణాల పరిచయం చాలదు. సరిపోతుందనుకునేవాడు – మనిషిలో మంచిచెడ్డలు కూడా క్షణాలమీద నిర్ణయించే పొరపాటు చేస్తాడు. సహనంతో మనుషుల గురించి ఆలోచించి అంచనా వేస్తే — ఈ లోకంలో చెడ్డవాళ్లే ఉండరు. అంతా మంచివాళ్లే!

జర్మనీలో నేను తెలుసుకున్న అనేక నిజాల్లో ఇదొకటి!

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments